క్లుప్తంగా

నవాబుపేట ఎస్‌ఐగా అభిషేక్‌రెడ్డి

నవాబుపేట: ఎట్టకేలకు నాలుగు నెలలు తరువాత నవాబుపేటకు ఎస్‌ఐని నియమించారు. కొత్తగా ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు ఆయనను సన్మానించారు.
మిడ్జిల్: ఎస్‌ఐ ఆనంద్ బుధవారం మిడ్జిల్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ శివానగేశ్వర్‌నాయుడు భూత్పూర్‌–2 ఎస్‌ఐగా బదిలీకావడంతో అయ్యారు.

ప్రత్యేక అధికారికి సన్మానం

చిన్నచింతకుంట: మండలకేంద్రలో ప్రత్యేక అధికారిగా శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టడంతో బుధవారం గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కోఆప్షన్ మెంబర్ మహిమూద్, ఎస్ వెంకటేష్, పొర్ల వెంకటేష్, రవి, ప్రతాప్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న 'గావ్ చలో'



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని మాధవరావు కాంపౌండ్‌లో మాజీ సర్పంచ్ సీతారాం ఆధ్వర్యంలో గావ్ చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలు అందజేశారు. గణేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.
హన్వాడ: ఇబ్రహీంబాద్‌లో బీజేపీ ఆధ్వర్యంలో గావ్‌చలో బుధవారం నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు కుర్మారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వాసు, కృష్ణ, అంజి తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

హన్వాడ: సీపీఎం ఆధ్వర్యంలో 16న చేపట్టనున్న బంద్ విజయవంతం చేయాలని నాయకులు అన్నారు. ఈ మేరకు హన్వాడలో గోడపత్రికను విడుదల చేశారు. రైతులు, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన

మిడ్జిల్: సైబర్ నేరాలపై బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా హెడ్‌కానిస్టేబుల్ రాజేశ్వరి మాట్లాడారు. ప్రజలు ఎవరైనా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నట్లు ఫోన్లు చేసి ఓటీపీ నంబరు అడిగితే చెప్పవద్దని తెలిపారు. అలాగే బ్యాంకుల వద్ద ఏటీఎం కార్డులతో డబ్బులు డ్రా చేసుకునేటప్పుడు పిన్‌నంబర్ ఎవరికీ తెలపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది మల్లేష్, విష్ణు పాల్గొన్నారు.

కార్డియాక్ సెంటర్ ప్రారంభం



పాలమూరు: జిల్లా కేంద్రంలోని సుశ్రుత ప్రజా వైద్యశాలలో బుధవారం నూతనంగా కార్డియాక్ సెంటర్ ఇన్‌టెన్సివ్ సర్జికల్ కేర్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణ, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రాంమోహన్ ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎండీ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగా ప్రారంభం చేసిన కార్డియాక్ సెంటర్‌లో అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఈసీజీ, 2డీ ఎకో, టీఎంటీ, యాంజియోగ్రామ్, యాంజియో ప్లాస్టీ, పేస్ మేకర్, ఇతర గుండె ఆపరేషన్స్ చేస్తామన్నారు. కార్యక్రమంలో గుండె వైద్యుడు భరత్‌కుమార్‌గౌడ్, డాక్టర్ ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే వేచి ఉంటున్న ప్రయాణికులు

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ స్టేజీ వద్ద ప్రయాణికులు ప్రమాదకరంగా హైవేపైనే నిలబడుతున్నారు. ఇక్కడ రహదారి పక్కన ప్రయాణికుల కోసం రహదారి నిర్వాహకులు బస్‌షెల్టర్‌ను నిర్మించలేదు. దీంతో పొన్నకల్, రాచాల, నందిపేట, జీనగరాలకు రాకపోకలు సాగించే వారికి నిత్యం ఆర్టీసీ బస్సులు, ఆటోల కోసం ప్రధాన రోడ్డుపైనే నిలబడాల్సిన పరిస్థితి వస్తోంది. దీనివల్ల అతివేగంగా వెళ్లే వాహనాలతో వారికి ప్రమాదం పొంచి ఉంది. ఒక్కోసారి బస్సులు, ఆటోలోంచి దిగే వారు సరిగ్గా చూసుకోకుండానే రోడ్డు దాటుతున్నారు. ఇదిలా ఉండగా బాలానగర్ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం నేపథ్యంలోనైనా నిర్వాహకులు చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.



ఆక్రమణల నిగ్గు తేలేనా?

- శిఖం భూముల గుర్తింపునకు చర్యలు
- చెరువుల్లో మార్కింగ్ చేస్తున్న అధికారులు



రంగారెడ్డిగూడలో ఎఫ్‌టీఎల్ మార్కింగ్ చేస్తున్న అధికారులు

రాజాపూర్: మండల పరిధిలో చెరువుల ఆక్రమణకు సంబంధించి నిగ్గు తేల్చేందుకు అధికారులు నడుం బిగించారు. భూముల ధరలు రూ.కోట్లలో పలుకుతున్న నేపథ్యంలో గ్రామ శివారుల్లో ఉన్న చెరువులు, కుంటలను అక్రమార్కులు వదలడం లేదన్న ఆరోపణలు, ఫిర్యాదులు రావడం.. వీటికి తోడు ఎమ్మెల్యే సూచనలతో చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. రాజాపూర్ మండలంలో మొత్తం 62 చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటికి తోడు భూగర్భ జలాలు పెంచేందుకు దుందుభీనది మధ్యలో 11 చెక్ డ్యాంలు, 1 కల్వర్టు ఉన్నట్లు ఉన్నాయి. వీటి కింద 5,500 ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే మండలంలోని కొందరు రియల్ వ్యాపారులు ఈ చెరువులు, కుంటలను తొలగించి వెంచర్లు చేస్తున్నారని ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. గతంలో రాజాపూర్ శివారులో ఒక కుంటను తొలగిస్తున్నారంటూ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు కూడా చేశారు. చెరువులు, కుంటలను ఆక్రమించి వెంచర్లుగా మార్చి అమ్ముకుంటున్నారని అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదులు సైతం అందాయి. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి సైతం పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన స్పందించి అధికారులు ఎఫ్‌టీఎల్ మార్కింగ్ చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే మండల వ్యాప్తంగా మార్కింగ్ సాగుతోంది. ఇప్పటి వరకు రంగారెడ్డిగూడ, చెన్నవెల్లి, కుచ్చర్‌కల్ గ్రామాల శివారులో ఉన్న 8 కుంటల్లో డిజిటల్ సర్వే చేసి మార్కింగ్ చేశారు. ఎఫ్‌టీఎల్ మార్కింగ్ పూర్తి చేసిన తర్వాత అట్టి సర్వే నంబర్ల ఆధారంగా చెరువులు, కుంటలకు సంబంధించిన భూమిని రెవెన్యూ అధికారులు గుర్తించాల్సి ఉంది. ఒకవేళ అక్రమణకు గురైతే అట్టి భూమిని స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే ఆక్రమణకు గురైన చెరువులకు, కుంటలకు మోక్షం కలగనుందని.. చెర వీడుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మార్కింగ్ సాగుతోంది

మండలంలోని అన్ని గ్రామాల శివారుల్లో ఉన్న చెరువులు, కుంటలకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఎఫ్‌టీఎల్ మార్కింగ్ చేస్తున్నాం. కార్యక్రమం కొనసాగుతోంది. అన్నింటికీ ఎఫ్‌టీఎల్ మార్కింగ్ చేసిన తర్వాత రెవెన్యూ అధికారులు సర్వే నంబర్‌ల ఆధారంగా మొత్తం శిఖం భూమి సరిగా ఉందా.. ఆక్రమణకు గురైందా గుర్తిస్తారు.

– శశిధర్, అసిస్టెంట్ ఎక్జ్యుటివ్ ఇంజనీర్ ఇరిగేషన్‌శాఖ

చర్యలు తప్పవు



ఎఫ్‌టీఎల్ మార్కింగ్ అయిన వెంటనే శిఖం భూమి ఎక్కడన్న అక్రమణకు గురైందా, లేదా కరెక్టుగానే ఉందా విషయాలపై క్షేత్రస్థాయిలో విచారణ జరుపుతాం. ఎక్కడైన చెరువులు, కుంటలు అక్రమణ చేస్తే అట్టి వారిపై చర్యలు తీసుకుంటాం.

– విద్యాసాగర్‌రెడ్డి, తహసీల్దార్, రాజాపూర్

కాంగ్రెస్‌ది ప్రజా ప్రభుత్వం



తిరుమలగిరి వీధుల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

బాలానగర్: కాంగ్రెస్‌ది ప్రజాప్రభుత్వమని.. వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తుందని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు. బుధవారం చిన్న రేవల్లి, తిరుమలగిరి, మొదంపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. వేసవిలో నీటి సమస్యలు రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం గ్రామాల్లో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌతమ్ రెడ్డి, మోహన్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్‌రాములు, బుజ్యానాయక్, రాములు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను కఠినంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న ప్రసన్న

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం బాలికల కోసం తీసుకువచ్చిన చట్టాలను కఠినంగా అమలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ నాయకులు మమత పేర్కొన్నారు ఈమేరకు జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళా కన్వెన్షన్ కార్యక్రమంలో మాట్లాడారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు మెడికల్ కిట్‌లు ఇవ్వాలని, నాణ్యమైన భోజనాన్ని అందించాలని అన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా రాధిక, కోకన్వీనర్‌గా రమాదేవి, ప్రసన్న, శిరీష తదితరులను ఎనుకున్నారు.

ప్రజా శ్రేయస్సే ధ్యేయం



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజల కోసం నిరంతరం పనిచేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో బుధవారం మహబూబ్‌నగర్ అర్బన్ మండలానికి చెందిన 45 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల ను పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమాన్ని కాంగ్రెస్ విస్మరించదని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అర్బన్ తహసీల్దార్ రాధాకృష్ణ, ఆర్‌ఐ చైతన్య, నాయకులు ఫయిం, అజ్మత్‌అలీ, అవేజ్, శివప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి సెలవు దినంగా ప్రకటించాలి

బాలానగర్: సంత్ సేవాలాల్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. లక్ష్మి, శ్రీను నాయక్, నందు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కేసునమోదు

అడ్డాకుల: తిమ్మాపూర్‌కి చెందిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుజాత తెలిపారు. వివరాలు ఇలా.. తిమ్మాపూర్‌కు చెందిన శాంతికుమార్ కొన్నాళ్ల నుంచి తన భార్య శివశాంతితో కలిసి జానంపేటలో నివసిస్తున్నాడు. కుటుంబ సంబంధ విషయంలో బుధవారం మధ్యాహ్నం ఇంటి వద్ద గొడవ జరిగింది. గొడవలో భార్యను భర్త కొట్టడంతో ఆమెకు తలకు గాయాలయ్యాయి. దీంతో బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో శాంతికుమార్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

మహమ్మదాబాద్: వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలపరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కంచన్‌పల్లికి చెందిన గుట్ట చంద్రయ్య సోమవారం (5వ తేది) ఉదయం 10 గంటలకు పొలానికి వెళ్లాడు. తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు చుట్టు పక్కల ఇళ్లల్లో ఆరా తీయడంతో పాటు బంధువుల దగ్గర కూడా వెతికారు. ఆచూకీ లభించక పోవడంతో చంద్రయ్య భార్య అంజిలమ్మ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ ఆజం అలీ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అడ్డాకుల: నిజాలాపూర్‌కి చెందిన సామాజిక కార్యకర్త బొబ్బిలి బాలచందర్ మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం పరామర్శించారు. జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, ఎంపీటీసీ సభ్యుడు సీజీ.గోవర్ధన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, తిరుపతయ్యగౌడ్ తదితరులు మృతదేహం వద్ద నివాళులు అర్పించారు.

స్థానికులకే ఎంపీ టికెట్ ఇవ్వాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పార్లమెంటు ఎన్నికల్లో అన్ని పార్టీలు పాలమూరు ఎంపీ టికెట్ స్థానికులకే ఇవ్వాలని మహబూబ్‌నగర్ అభివృద్ధి ఫోరం చైర్మన్ మున్నూరు రవి డిమాండ్ చేశారు. బుధవారం ఫోరం కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ఇదివరకు స్థానికేతరులు ఎంపీలుగా గెలిచి ఇక్కడి ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. త్వరలోనే అన్ని పార్టీల అధినేతలను వినతి పత్రాలు ఇస్తామన్నారు. మన ఓటు మన అభివృద్ధి కరపత్రం విడుదల చేశారు. వినయ్ కుమార్, సాజిదా సికిందర్, పటేల్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

విద్యాప్రమాణాలు పెంచుతాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

దేవరకద్ర రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు కృషిచేస్తున్నామని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. జిల్లా విద్యాధికారి రవీందర్‌తో కలిసి బుధవారం దేవరకద్రలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ. 10 కోట్ల కేటాయించిందన్నారు. అందులో రూ. 2 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను సమకూరుస్తామని పేర్కొన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, మండల నాయకులు అరవింద్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, అంజిల్ రెడ్డి, కిషన్‌రావు, రాఘవేందర్ రెడ్డి, వర్మ తదితరులు పాల్గొన్నారు.

పంచాంగం ఆవిష్కరణ

దేవరకద్ర రూరల్: వీరశైవ జంగమ అర్చక పురోహిత సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా బ్రహ్మశ్రీ నందుల మఠం శశిభూషణ సిద్ధాంతి చే గుణించబడిన నూతన పంచాంగాన్ని ఆవిష్కరింపజేశారు. అర్చకులు సురేష్, సర్వేశ్వర్, సురేష్, భూషణ్, పరమేష్, రవిశంకర్, నట్‌రాజ్, అనిల్ పాల్గొన్నారు.

బియ్యం బ్లాక్‌మార్కెట్‌కు తరలితే చర్యలు



రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీసీఎస్‌ఓ శ్రీనివాస్

జడ్చర్ల: చౌకధర దుకాణాలలో సకాలంలో రేషన్ బియ్యం పంపిణీ చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్ డీలర్లను ఆదేశించారు. బుధవారం పట్టణ పరిధిలోని రేషన్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. నిర్ణీత సమయాల్లో వినియోగదారులకు అందుబాటులో డీలర్లు ఉండాలని అన్నారు. వినియోగదారులకు బియ్యాన్ని ఇవ్వకుండా కొందరు డీలర్లు డబ్బులు ఇచ్చి అట్టి బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారన్న సమాచారం ఉందనని అన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో డీఎం ప్రవీణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వెంకటేశ్వర్‌రెడ్డి, వరప్రసాద్, నాగరాజు, వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకుడు బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి పట్ల బాల్క సుమన్ అనుచితంగా మాట్లాడడం సరికాదన్నారు. అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదన్నారు. నిరసనలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అవేజ్ అహ్మద్, రాష్ట్ర కార్యదర్శి ముకుందం రమేష్, అహ్మద్, అసెంబ్లీ మణిరత్నం, పట్టణ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.
దేవరకద్ర రూరల్: జిల్లా కాంగ్రెస్ ఎస్సీసెల్ ఆధ్వర్యంలో దేవరకద్రలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. అధ్యక్షుడు సాయిబాబా, మండల అధ్యక్షుడు బాలయ్య, ఎంపీటీసీ నాగరాజు, పట్టణ అధ్యక్షుడు రాములు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికత పెంపొందించడమే లక్ష్యం



కంప్యూటర్లు ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

గండేడ్: మారుతున్న పరిస్థితులకనుగుణంగా గ్రామీణ విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించి వారి అభ్యున్నతికి కృషి చేయడమే లక్ష్యమని వెన్నాచేడ్ మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కొండల్‌రావు పేర్కొన్నారు. బుధవారం స్కూల్‌కు మంజూరైన పది కంప్యూటర్లను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో సాంకేతిక అందుబాటులో లేకపోవడం వల్ల చాలామంది దూరం అవుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం కంప్యూటర్లు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



మిడ్జిల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటివారికి పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం సరస్వతి, ఉపాధ్యాయులు పరుశరామ్, కోట్యా, సురేందర్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, కృష్ణ, శ్రీశైలం, రవిశంకర్, అరుణ, సుమతి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన పారిశుద్ధ్య వారోత్సవాలు



గౌరిదేవిపల్లిలో శ్రమదానం చేస్తున్న ఎంపీడీఓ మంజుల

నవాబుపేట: ప్రభుత్వం చేపట్టిన పారిశుద్ధ్య వారోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మండల స్పెషల్ అధికారి సుధాకర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ మల్లికార్జున్‌రావు ఆయా గ్రామాల్లో కార్యక్రమాల్లో పాల్గొని అధికారులకు సూచనలు చేశారు.
అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లోని గ్రామాల్లో బుధవారం గ్రామాల ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక పారిశుద్ధ్య పనుల కార్యక్రమాలను చేపట్టారు.
చిన్నచింతకుంట: బండ్రపల్లిలో కార్యక్రమానికి ప్రత్యేక అధికారి లక్ష్మణ్ సింగ్ హాజరయ్యారు.పారిశుద్ధ్య పనులు చేయించారు. కార్యక్రమంలో కార్యదర్శి నర్సింహులు, మాజీ సర్పంచ్ మొగిలన్న, జంగం రవి, నారాయణ, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



దయాపంతులపల్లిలో..



బండ్రపల్లిలో..

పాదయాత్ర బృందానికి ఘనస్వాగతం



జడ్చర్ల టౌన్: తిరుమలకు పాదయాత్రగా వెళ్తున్న శ్రీవారి భక్తులు, రథయాత్రకు బుధవారం మండలంలోని దేవునిగుట్టతండా శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయ పరిధిలో ఘనస్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించి అన్నదానంలో పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం తిరిగి పాదయాత్రను ప్రారంభించారు. కాగా లక్ష్యసాధన ఫౌండేషన్ సహకారంతో రంగాచార్యుల ఆధ్వర్యంలో యాత్ర హైదరాబాద్ నుంచి ప్రారంభమైంది.

ఉత్తమ సేవలు అందించాలి

మహమ్మదాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉత్తమ సేవలు అందించాలని తహసీల్దార్ యేసయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లమ్మ పేర్కొన్నారు. రామకొండ కాలనీలోని అంగన్‌వాడీలో ప్రియాంక టీచర్‌గా విధుల్లో చేరిన సందర్భంగా మాట్లాడారు. కేంద్రానికి వచ్చే వారికి నిబంధనల మేరకు పౌష్టికాహారం అందించాలన్నారు. టీచర్లు అరుణ, లలిత, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.